క్లుప్తంగా

అవంతి ఫీడ్ షాపు ప్రారంభం


షాపును ప్రారంభిస్తున్న ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి

కొత్తపట్నం: స్థానిక జెడ్పీ హైస్కూల్ ఎదురుగా శ్రీవిష్ణుష్ ఆక్వా ఏజెన్సీస్ పేరుతో బుధవారం నూతనంగా అవంతి ఫీడ్ షాపును ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా అవంతి ఫీడ్ అనేక ఫలితాలిచ్చి దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఫీడ్ తయారీలో వాడే మెటీరియల్ నాణ్యమైనదని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అవంతి రీజినల్ మేనేజర్ గోపాలకృష్ణయ్య, ఏరియా మేనేజర్లు నారాయణస్వామి, వెంకట్రావు, రవిశంకర్, అసిస్టెంట్ మేనేజర్ సుధాకర్, ప్రసాద్, మోటుమాల సర్పంచ్ కోడూరి గోపి, కోడూరి అనీల్ రెడ్డి, మోహన్, రైతులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంకు ద్వారా అత్యుత్తమ సేవలు


సంతనూతలపాడులో కెనరా బ్యాంకును ప్రారంభించిన అనంతరం రైతులతో మాట్లాడుతున్న పాండురంగ మితంతయ్

సంతనూతలపాడు: దేశవ్యాప్తంగా కెనరా బ్యాంకుల ఆధ్వర్యంలో 25 లక్షల 30 వేల కోట్ల రూపాయల లావాదేవీలతో అత్యుత్తమ సేవలు అందిస్తున్నట్లు కెనరా బ్యాంకు తిరుపతి సర్కిల్ జనరల్ మేనేజర్ పాండురంగ మితంతయ్ తెలిపారు. సంతనూతలపాడులో ఆధునికీకరించిన కెనరా బ్యాంక్ శాఖను బుధవారం సాయంత్రం ఆయన ప్రారంభించిన అనంతరం ఖాతాదారుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. సంతనూతలపాడు కెనరా బ్యాంక్ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ జే ఆనంద్ కుమార్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఏజీఎం బి.రాఘవేందర్, అధికారులు, ఖాతాదారులు పాల్గొన్నారు. అనంతరం మద్దిపాడులో ఆధునికీకరించిన కెనరా బ్యాంకును కూడా వారు ప్రారంభించారు.

ఆలయానికి ఉత్సవమూర్తుల అందజేత

సీఎస్పురం(పామూరు): మండలంలోని శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథస్వామి ఆలయంలో స్వామి జేష్టమాస పూజలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా జేష్టమాసం విశిష్టతను సంతరించుకోవడంతో ఆలయానికి మండలంలోని జీనుగువారిపల్లె గ్రామానికి చెందిన పత్తి పెద్ద వెలుగొండయ్య జ్ఞాపకార్థం ఆయన సతీమణి పత్తి జయమ్మ శ్రీతిరుమలనాథస్వామి, శ్రీదేవి, భూదేవి పంచలోహ ఉత్సవమూర్తులను అందజేశారు. ఉత్సవ విగ్రహమూర్తులకు అర్చకులు రామమూర్తి దాతలతో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగిరెడ్డి రామచంద్రారెడ్డి, ముత్యాల వెంకటకొండారెడ్డి, జి.వెంకటనారాయణరెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, పత్తి రవి, స్వప్న, గుర్రం నరేంద్ర, సిద్ద సావిత్రమ్మ, భక్తులు పాల్గొన్నారు.


ఇటీవల కురిసిన వర్షానికి పూర్తిగా మునిగిపోయిన ఉప్పు భూములు


మడిలో తీసిన ఉప్పు కరిగిపోయిన దృశ్యం (ఫైల్)

వర్షం నీటిలో కరిగిన కష్టం

- అకాల వర్షాలకు భారీగా నష్టపోయిన ఉప్పు రైతులు
- అసలే ఈ ఏడాది 25 శాతం తగ్గిన ఉత్పత్తి
- ఉష్ణోగ్రతలు తగ్గినందున రైతుల ఆందోళన
- ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్


అరకొరగా ఉన్న ఉప్పుకు పట్టలు కప్పుకుని జాగ్రత్త చేసుకుంటున్న రైతులు

కొత్తపట్నం:

ఈ ఏడాది ఉప్పు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. అధిక ఉత్పత్తి వచ్చే నెలలోనే వర్షాలు పడటం వలన ఉత్పత్తి ఆగిపోయింది. పెట్టిన పెట్టుబడులు కూడా రాక ఏం చేయాలో అర్థంగాక వారంతా ఆందోళన చెందుతున్నారు. ప్రతి ఏటా మే నెలలో ఎక్కువ ఉష్ణోగ్రతలు పెరిగి అధికంగా ఉప్పు ఉత్పత్తి అవుతుంది. పెట్టుబడులకు తెచ్చిన అప్పులు కూడా మే నెలలోనే తీర్చుకుంటారు. కానీ, ఈ నెలలో మేఘాలు కమ్ముకుని చల్లటి గాలులు వీచడంతో ఉప్పుమడులు దెబ్బతిన్నాయి. వర్షాలు కూడా కురవడంతో ఉప్పు కరిగి బురదతో మేట వేసింది. దీంతో ఇప్పటి నుంచి ఉప్పు రావడానికి నెల రోజులు పడుతుందని రైతులు అంటున్నారు. అయితే, ఈలోపు మళ్లీ వర్షం కురిస్తే ఈ ఏడాదికి ఉప్పు ఉత్పత్తి నిలిచిపోతుందని రైతులు అంటున్నారు. కొత్తపట్నం మండలంలోని మోటుమాల, కొత్తపట్నం, బీరంగుంట, పాదర్తి, గుండమాల గ్రామాల్లో సుమారు 2 వేల ఎకరాల్లో ఉప్పు సాగు చేస్తారు. రైతులు, కూలీలు కలిపి సుమారు 8 వేల మంది ఉప్పు సాగుపై ఆధారపడి జీవిస్తారు. ఏడాదికి ఒక్కో ఎకరాకు క్వింటా బ్యాగ్‌లు 1000 నుంచి 1,200 ఉత్పత్తి చేస్తారు. ఒక్కో బ్యాగ్ రూ.100 నుంచి రూ.120 వరకు ధర పలుకుతుంది. పెట్టుబడి ఒక్కో ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకూ అవుతుంది. ఇంత పెట్టుబడి పెట్టినప్పటికీ ఇప్పటి వరకు ఎకరాకు 300 బ్యాగ్‌లు తీయలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏడాదిలో మే నెలలోనే 50 శాతం ఉప్పు ఉత్పత్తి వస్తుందని, కానీ, ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు ఉప్పు రైతులకు నిరాశ మిగిలించాయని అంటున్నారు. వర్షంతో ఉప్పుమడులలో బురద ఏర్పడి దానిని తొలగించడానికి అదనపు కూలి ఖర్చవుతుందని వాపోతున్నారు. తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలని, వడ్డీలు పెరుగుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పట్టించుకుని ఉప్పు రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి

- వృద్ధులు, వికలాంగులకు ఇంటివద్దకే తీసుకెళ్లి ఇవ్వాలి
- ఎలక్ట్రానిక్ వేయింగ్ మెషీన్లకు లీగల్ మెట్రాలజీ అధికారుల ద్వారా పరీక్షలు చేయించాలి
- అక్రమాలకు పాల్పడిన డీలర్లపై కఠిన చర్యలు తప్పవు
- రేషన్ డీలర్లతో ఒంగోలు ఆర్‌డీఓ లక్ష్మీప్రసన్న


డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఒంగోలు ఆర్‌డీఓ లక్ష్మీప్రసన్న

ఒంగోలు సబర్బన్: ప్రజా పంపిణీ వ్యవస్థలో నిత్యావసర సరుకుల పంపిణీ సక్రమంగా చేపట్టాలని రేషన్ షాపుల డీలర్లకు ఒంగోలు రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డీఓ) కె.లక్ష్మీప్రసన్న సూచించారు. ఒంగోలు రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల చౌకధరల దుకాణాల డీలర్లతో కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా రేషన్ షాపుల వద్దే నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిన విషయం గురించి వివరించారు. ఎండీయూ వాహనాలు రద్దయిన దృష్ట్యా డీలర్లకు రేషన్ షాపుల నిర్వహణ, నిత్యావసర సరుకుల పంపిణీపై అవగాహన కల్పించారు. జూన్ 1న పండుగ వాతావరణంలో రేషన్ కార్డుదారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని తెలిపారు. దివ్యాంగులకు, 65 సంవత్సరాలు దాటిన వృద్ధులకు వారి ఇంటివద్దకే తీసుకెళ్లి డీలర్లు సరుకులు పంపిణీ చేయాలన్నారు. ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు రేషన్ షాపు వద్దనే కార్డుదారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు పంపిణీ చేయాలన్నారు. దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి వద్దకు తీసుకెళ్లి అందించాలన్నారు. వారు ఏ సమయాల్లో ఇంటి వద్ద ఉంటారో ముందుగా తెలుసుకుని డీలర్ల వీలును బట్టి ఇంటికి తీసుకెళ్లి ఇవ్వాలని స్పష్టం చేశారు. పంపిణీ వ్యవస్థలో ఎలాంటి అక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవన్నారు. ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్‌లను లీగల్ మెట్రాలజీ అధికారులచే తనిఖీ చేయించుకుని ధ్రువీకరణ పత్రాలు పొందాలని సూచించారు. సరుకుల తూకం విషయంలో ఎలాంటి అవకతవకలకు పాల్పడవద్దన్నారు. ఎప్పటికప్పుడు రేషన్ షాపులను ఆకస్మికంగా తనిఖీలు చేస్తామని ఆర్‌డీఓ తెలిపారు.

డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాకు అభినందనలు


డీజీపీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: డీజీపీగా పూర్తిస్థాయి బాధ్యతలు తీసుకున్న హరీష్‌కుమార్‌గుప్తాను ఎస్పీ ఏఆర్ దామోదర్ అభినందించారు. బుధవారం విజయవాడ నుంచి కడప వెళుతూ మార్గం మధ్యలో ఒంగోలులో డీజీపీ ఆగారు. ఆయనతో పాటు ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీపీ మహేష్ చంద్ర లడ్హా, లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీపీ ఎస్.మధుసూదన్‌రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్పీతో పాటు జిల్లా పోలీసు అధికారులంతా డీజీపీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, ఎస్బీ సీఐ రాఘవేంద్ర, ఐటీ కోర్ సీఐ సూర్యనారాయణ, టూటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు, వన్‌టౌన్ సీఐ నాగరాజు, తాలూకా సీఐ విజయకృష్ణ, రూరల్ సీఐ శ్రీకాంత్, ఆర్ఐ సీతారామిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఇబ్బందుల్లో ఉన్న పిల్లల గుర్తింపు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఐసీడీఎస్ పీడీ తదితరులు

ఒంగోలు సబర్బన్: జిల్లా వ్యాప్తంగా ఇబ్బందుల్లో ఉన్న పిల్లలను గుర్తించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టినట్లు కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా తెలిపారు. స్థానిక ప్రకాశం భవన్‌లో బుధవారం వనరబుల్ చిల్డ్రన్స్ కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఇబ్బందులు పడుతున్న పిల్లలను గుర్తించి వారిని తిరిగి స్కూళ్లో, స్కిల్ డెవలప్మెంట్ కోర్సుల్లో చేర్పే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. పిల్లలు, వారి కుటుంబ సభ్యులు ప్రభుత్వం నుంచి ఏమైనా సంక్షేమ పథకాలకు అర్హులై ఉండి అందకుంటే వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. అందుకోసం మొబైల్ - వెబ్ అప్లికేషన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ముందుగా ప్రకాశం జిల్లాలోని రాచర్ల మండలాన్ని ఒక పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి 360 మంది ఇబ్బందిపడుతున్న పిల్లలను గుర్తించడం జరిగిందన్నారు. ఈ సర్వేలో 360 మంది పిల్లల్లో కొంతమంది డిజేబుల్ పిల్లలు మాకు టూ వీలర్, ఫోర్ వీలర్ చైర్స్ కావాలని అడగడంతో సంబంధిత అధికారుల ద్వారా వారికి వీల్ చైర్స్ ఇప్పించడం జరిగిందని వివరించారు. మిగతా పిల్లలకు కూడా ఎడ్యుకేషన్ పరంగా వారికి ఏం కావాలో అవి అందించడం జరిగిందన్నారు. నిజమైన అవసరాలు ఏమిటో గుర్తించి ఈ అప్లికేషన్‌లో పొందుపరచాలని, ఈ ట్రైనింగ్ ప్రోగ్రాంను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారిత అధికారిణి డి.హేన్ సుజన, జిల్లా బాలల సంరక్షణ అధికారి సి.దినేష్ కుమార్, నోడల్ ఆఫీసర్ గిరిధర్‌శర్మ, సునీల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రామతీర్థం జలాశయానికి సాగర్ జలాలు



చీమకుర్తి రూరల్: మండలంలోని రామతీర్థం జలాశయానికి బుధవారం సాగర్ జలాలు చేరాయి. తాగునీటి కోసం చెరువులకు నీరు నింపేందుకు సాగర్ జలాలు విడుదల చేశారు. రామతీర్థం జలాశయంలో ప్రస్తుత నీటిమట్టం 80.02 మీటర్లు ఉంది. పూర్తి స్థాయి నీటి మట్టం 85.34 మీటర్లు కాగా, నిండా నింపి తాగునీటి అవసరాల కోసం దిగువకు వదలనున్నట్లు అధికారులు తెలిపారు.

రఘునాథరెడ్డి కుటుంబానికి పరామర్శ


మద్దెల కోటయ్యకు నివాళులర్పిస్తున్న రవిబాబు, అంజిరెడ్డి, గోపాల్‌రెడ్డి, నాయకులు

కొత్తపట్నం: వైఎస్సార్ సీపీ నాయకుడు మద్దెల రఘునాథరెడ్డి తండ్రి మద్దెల కోటయ్య ఈ నెల 10వ తేదీ అనారోగ్యంగా మృతి చెందారు. బుధవారం పెద్ద కర్మకు పార్టీ ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్త చుండూరి రవిబాబు, కొత్తపట్నం మండల అధ్యక్షుడు, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, పార్టీ శ్రేణులు హాజరై రఘునాథరెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. కోటయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈతముక్కల మాజీ సర్పంచ్ దాచూరి గోపాల్‌రెడ్డి, బాజీ, పార్టీ కొత్తపట్నం గ్రామ అధ్యక్షుడు తంబి వెంకటేష్, తంబి కాంతారావు, కోడూరి శ్రీను, పురిణి పోలయ్య, గౌరవరపు శివాజీ, ద్వారం మురళి, తంబి వెంకటేశ్వర్లు, మల్లికార్జున, తుళ్లూరి వెంకటనారాయణ, మరపాల సుధాకర్‌రెడ్డి, ద్వారం నాగరాజు, రాగాల బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఇలాకాలో ఎన్టీఆర్‌కు అవమానం

- ఎన్టీఆర్ జయంతి రోజు విగ్రహానికి దండ కరువు

సాక్షి టాస్క్‌ఫోర్స్: రాష్ట్ర సాంఘిక శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయస్వామి స్వగ్రామంలో ఎన్టీఆర్‌కు అవమానం జరిగింది. కడపలో జరుగుతున్న మహానాడులో బిజీబిజీగా ఉన్న మంత్రి స్వామి స్వగ్రామమైన తూర్పునాయుడుపాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి బుధవారం కనీసం పూలమాలలు వేసే వారు కరువయ్యారు. రాష్ట్రం మొత్తం ఎన్టీఆర్ జయంతి వేడుకలు నిర్వహిస్తుంటే మంత్రి స్వగ్రామంలో ఆ కార్యక్రమాన్ని పట్టించుకునే వారే లేకపోయారు.

ఇళ్లలో నిల్వలు..రైతు కళ్లలో కన్నీళ్లు..

- పొగాకు రైతులకు గడ్డు కాలం
- రైతుల ఇళ్లల్లో నుంచి కదలని పొగాకు
- వేలంలో నిత్యం వందల బేళ్లు తిరస్కరణ
- పట్టించుకోని ప్రభుత్వం


ట్రాక్టర్లపైనే పొగాకు బేళ్లు


కనిగిరి పొగాకు కేంద్రంలో పొగాకు బేళ్లు


ఇళ్లలోనే పొగాకు బేళ్లు..

కనిగిరిరూరల్:

పొగాకు రైతులకు గడ్డు కాలం వచ్చింది. గతమెంతో ఘనం అన్న చందంగా కూటమి ప్రభుత్వ పాలనలో పొగాకు రైతులు దయనీయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. నియోజకవర్గంలో అత్యధికంగా వాణిజ్య పంట అయిన పొగాకును ఎక్కువగా సాగు చేస్తారు. జిల్లాలో నాణ్యమైన పొగాకు పండిస్తారని కనిగిరికి పేరుంది. అయితే ఈ ఏడాది సాగు ప్రారంభం నుంచి అమ్మకం వరకు రైతులు అష్టకష్టాలు పడుతూనే ఉన్నారు. సాగు ప్రారంభంలో అకాల వర్షాలు ఇబ్బంది పెట్టగా..పొగాకు అమ్మకాల్లో గిట్టుబాటు ధరలు లేక రైతులు అప్పుల పాలయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. పొగాకు రైతును ఆదుకోవాల్సిన ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రోజు రోజుకు ధరలు తగ్గి రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

25 శాతం కూడా కొనుగోళ్లు కాని దుస్థితి

కనిగిరి పొగాకు బోర్డు పరిధిలో పొగాకు సాగు విస్తీర్ణం 4,952 హెక్టార్లు. మొత్తం 5 క్లస్టర్ల పరిధిలో 74 గ్రామాల్లో 1245 బ్యార్నీలు ఉన్నాయి. ఈ ఏడాది పొగాకు ఉత్పత్తి 8.5 మిలియన్ కేజీలుగా వచ్చినట్లు అధికారులు తెలిపారు. అయితే వేలం ప్రారంభమై రెండు నెలలు దాటినా ఇప్పటి వరకు 1.8 మిలియన్ కేజీలు మాత్రమే కొనుగోలు చేశారు. నిత్యం వందల సంఖ్యలో బేళ్ల తిరస్కరణకు గురవుతున్నాయి. ఇప్పటి వరకు కేవలం 25 శాతం కూడా కొనుగోలు జరగలేదు.

సిండికేట్‌గా వ్యాపారులు..

పొగాకు కంపెనీలు సిండికేట్‌గా మారి పొగాకు రైతులను నట్టేట ముంచుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదవుతున్నా పొగాకు రైతుల సమస్యలను ఏనాడు పట్టించుకోలేదు. ధరలు లేవని రైతులు వేలాన్ని అడ్డుకొని రోడ్డెక్కుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదు. ప్రభుత్వరంగ సంస్థ అయిన మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులు వేలం ఇష్టం వచ్చినట్లు ధరలు ఇస్తూ రైతులను ముంచుతున్నారు. వేలంలో కేవలం గ్రేడ్-1 పొగాకును మాత్రమే కొనుగోలు చేసి మిగిలిన బేళ్లను తిరస్కరిస్తున్నారు. దీంతో నిత్యం వందల సంఖ్యలో బేళ్లు వెనక్కి రావడంతో వాటిని తిరిగి తీసుకురావడం రైతులు ఎన్నో వ్యయప్రయాసలకు లోనవుతున్నారు. కేవలం ఒకటి రెండు కంపెనీలు మాత్రమే వేలంలో యాక్టివ్‌గా ఉండటంవల్లే ధరలు రావడం లేదని రైతులంటున్నారు.

గతమెంతో ఘనం..

గతేడాది కనిగిరి టుబాకో బోర్డు పరిధిలో 7.58 మిలియన్ కేజీల ఉత్పత్తి దిగుబడి వచ్చింది. దాదాపు రైతు దగ్గర ఉన్న పొగాకు మొత్తాన్ని బోర్డు అధికారులు, ప్రభుత్వం కొనుగోలు చేసింది. గత ప్రభుత్వంలో గరిష్ట ధర రూ.360 పైనే రైతులకు వచ్చింది. కనిష్ట ధర రూ.280 వరకు కొనుగోలు చేశారు. ఎందుకు పనికిరాని గుల్లాకు సైతం రూ.250పైనే బోర్డులో కొనుగోలు చేశారు. ఆ ధరలను చూసిన రైతులు ఈ ఏడాది ఎంతో ఉత్సాహంగా పొగాకు సాగు చేశారు. కానీ పంట సరిగ్గా దిగుబడి రాక.. పెట్టుబడులు పెరిగి.. గిట్టు బాటు ధర లభించక లబోదిబోమంటున్నారు.

ఇళ్లల్లో పేరుకుపోయిన నిల్వలు..

బోర్డు అధికారులు గిట్టు బాటు ధరలు ఇవ్వక.. అన్ని గ్రేడ్ పొగాకు బేళ్ల కొనుగోలు చేయక పోవడంతో పొగాకు బేళ్లు రైతుల ఇళ్లల్లో గుట్టలు గుట్టలుగా ఉన్నాయి. అయితే అకాల వర్షంతో మొదటి కొట్టుడు పంట నాణ్యత కొంత మేర తగ్గగా.. రెండో కొట్టుడుకు మంచి నాణ్యత పొగాకు వచ్చింది. అదే రైతు రెండో విడతలో వేసిన పొగాకులో అధిక ఉష్ణోగ్రతలో పంట దెబ్బతింది. వెరసీ పొగాకు రైతుకు గడ్డుకాలం వచ్చింది. అయితే వేలం కేంద్రం వద్దకు రైతు నాల్గు రకాల బేళ్లను తీసుకెళ్లగా.. మంచి రకంగా గ్రేడ్‌ను మాత్రమే తీసుకోవడంతో మిగతా పంటను పలు మార్లు ట్రాక్టర్లలో అద్దెలు కట్టి తీసుకెళ్లలేక. అదనపు పెట్టుబడి పెట్ట లేక రైతు పొగాను గుట్టలు గుట్టలుగా ఇంట్లోనే పేర్చుకుని దిగాలు చెందుతున్నారు..

అన్ని రకాల పొగాకు బేళ్లను కొనుగోలు చేయాలి:



ప్రకృతి వైపరీత్యాలతో దిగుబడి తగ్గింది. నాణ్యమైన పొగాకుతో పాటు.. లోగ్రేడ్, మిడియం పొగాకు దిగుబడి వచ్చింది. బ్యార్నీకి 50 నుంచి 60 క్వింటాళ్ల దిగుబడి వచ్చినా మంచి రకంతో పాటు, మిడియం, మాడు రకాలు వచ్చాయి. అయితే పొగాకు బోర్డుకు ఇప్పటికి 5 సార్లు పొగాకు బేళ్లను తీసుకెళ్లినా గ్రేడ్-1 పొగాకునే కొనుగోను చేసి మిగిలిన వాటిని తిరస్కరిస్తున్నారు. దీంతో తీవ్రంగా నష్టపోతున్నారు. కనిష్ట ధరలు రోజు రోజుకు తగ్గిస్తున్నారు. ధరలు ఇలానే ఉంటే రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. అన్ని రకాల పొగాకు బేళ్ల గ్రేడ్‌లను కొనుగోలు చేయాలి.

పోతిరెడ్డి రాజా, రైతు, మాచవరం

ప్రజా పోరాటాలకు సిద్ధం కండి


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ నారాయణ

కనిగిరిరూరల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు గాలికి వదిలాయని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ నారాయణ అన్నారు. మండలంలోని ఏరువారిపల్లిలో సీపీఐ మండల మహాసభలు గుజ్జుల యల్ల మందారెడ్డి భవన్‌లో నిర్వహించారు. సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ కూటమి సర్కార్ హామీల అమలులో తీవ్రంగా విఫలం చెందిందన్నారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసేంత వరకు సీపీఐ పోరాటం చేస్తోందన్నారు. ఆగస్టులో ఒంగోలులో జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలను, జూన్‌లో దర్శిలో జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా నాయకులు వై రవీంద్రబాబు, సయ్యద్ యాసీన్‌లు మాట్లాడుతూ ప్రభుత్వాలు చేపడుతున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై సీపీఐ శ్రేణులు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. తొలుత పార్టీ జెండాను సీనియర్ నాయకులు వై ప్రభాకర్ ఆవిష్కరించారు. ఎన్టీయూ రాష్ట్ర మాజీ నేత బృంగి సుబ్రహ్మణ్యం, సీపీఐ, వివిధ సంఘాల నాయకులు పందిమోహన్, ఖాదర్ మస్తాన్, జయంపు అంకమ్మ, గుజ్జుల బాలిరెడ్డి, జీపీ రామారావు పాల్గొన్నారు.